www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 20 జులై 2023
5
ఏలూరు



ట్రేడ్ యూనియన్ల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఈనెల 26వ తేదీన విజయవాడలో జరిగే విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, ట్రేడ్ యూనియన్‌ల పోరాట కమిటీ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక 132 కెవి సబ్ స్టేషన్ వద్ద సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా కార్మికులను, ఉద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఎన్నో సందర్భాల్లో పోరాటాలు చేసినా ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణాలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు డైరెక్ట్ పేమెంట్ అమలు చేసి కేసీఆర్ ప్రభుత్వం న్యాయం చేసిందన్నారు. కానీ జగన్ ప్రభుత్వం ద్రోహం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్‌వి.ప్రసాద్, సురేష్, మణికంఠ, గంగాధర్, మేరి ప్రసాద్, సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు పాల్గొన్నారు.

వరద భయం..!

పెరుగుతున్న గోదావరి ఉధృతి
భద్రాచలం వద్ద 31 అడుగులకు చేరిన నీటిమట్టం
పోలవరం కాపర్ డ్యామ్ వద్ద నీటిమట్టం 29 మీటర్లు
దిగువకు లక్షా 65 వేల క్యూసెక్కుల నీరు విడుదల
కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజల గుండెల్లో గుబులు
గతేడాది ఇదే సమయానికి వరద బీభత్సం
ఏడాదైన అమలు కాని ప్రభుత్వ హామీలు



పోలవరం కాపర్ డ్యాం వద్ద వరద ఉధృతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కుక్కునూరు, వేలేరుపాడు మండలంలోని గ్రామాల ప్రజలను వరద భయం వెంటాడుతోంది. వర్షాలకు గోదావరి ఉధృతి పెరుగుతుండటంతో గతేడాది భయానక పరిస్థితిని గుర్తు చేసుకుని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 31 అడుగులకు చేరింది. పెద్దఎత్తున వరద నీరు వచ్చిపడుతుండటంతో పోలవరం కాపర్ డ్యామ్ వద్ద నీటిమట్టం 29 మీటర్లకు చేరింది. దీంతో సాయంత్రం ఐదు గంటలకు పోలవరం స్పిల్‌వే నుంచి లక్షా 65 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. గతేడాది ఈ సమయానికి గోదావరి వరదకు పోలవరం నిర్వాసిత గ్రామాల ప్రజల పరిస్థితి అత్యంత దారుణంగా మారిన సంగతి అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్లీ గోదావరి పెరుగుతుండటంతో అక్కడి ప్రజలు గుండెల్లో రైళ్లు పెరుగుతున్నాయి. ప్రతియేటా గోదావరికి వరదలు రావడం సహజమే. గతంలో ఎన్నడూ ఏజెన్సీ ప్రజలు వరదలకు పెద్దగా భయపడిన పరిస్థితి లేదు. అయితే పోలవరం ప్రాజెక్టులో కీలకమైన కాపర్ డ్యామ్ నిర్మాణం 44 మీటర్ల పూర్తి చేశారు. దీంతో చిన్నపాటి వరదకు కూడా గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. దీంతో రోజుల వ్యవధిలోనే గోదావరి వరద గ్రామాలను ముంచెత్తుతోంది. గడిచిన రెండు రోజులుగా అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. మంగళవారం జిల్లావ్యాప్తంగా సరాసరిన 20.05 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం సైతం భారీ వర్షం కురిసింది. గోదావరి పరివాహక ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున వర్షం కురుస్తుండటంతో గోదావరి నీటిమట్టం పెరుగుతోంది.

అమలు కాని సిఎం ప్రకటన

పోలవరం ప్రాజెక్టులో ముంపునకు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 107 గ్రామాల ప్రజలు నిర్వాసితులుగా మారుతున్నారు. వీరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూమికి భూమి, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం, నిర్వాసిత కాలనీల్లో సదుపాయాలు వంటివి కల్పించి తరలించాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితుల గురించి పట్టించుకోకుండా ప్రాజెక్టు నిర్మాణంపైన దృష్టి సారించాయి. దీంతో ప్రతియేటా గోదావరి వరదకు నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది జులైలో విరుచుకుపడిన వరదలకు 90కుపైగా గ్రామాలు నీట మునిగాయి. కట్టుబట్టలతో జనం నిర్వాసిత కాలనీలకు చేరారు. వరద బాధితుల పరామర్శకు వేలేరుపాడు మండలం కన్నాయిగూడెం గ్రామం వెళ్లిన సిఎం జగన్ 2022 అక్టోబర్‌కు 41.15 కాంటూరులోని గ్రామాల నిర్వాసితులందరికీ పరిహారం ఇచ్చేస్తామని, 45.72 కాంటూరు నిర్వాసితులకు మాత్రం కేంద్రం సహకరించాల్సి ఉందని తెలిపారు. సిఎం ప్రకటించి ఏడాది గడిచినా 41.15 కాంటూరు పరిధిలోని 42 గ్రామాల్లోని నిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం అందించని పరిస్థితి నెలకొంది. ఎనిమిది వేల ఇళ్లు వరదలకు దెబ్బతినగా, కేవలం ఐదువేల పైచిలుకు ఇళ్లకు మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందించి చేతులు దులుపుకుంది. కాపర్‌డ్యామ్ అడ్డుగా కట్టడంతో వరదనీరు రెండు వారాలకుపైగా గ్రామాలను వీడలేదు. వరదకు చేరిన బురదను శుభ్రం చేసుకోవడానికి ఒక్కో కుటుంబానికి రూ.20 వేలు పైనే ఖర్చయింది. నిర్వాసితులంతా నెలలు తరబడి పునరావాస కాలనీల్లో గడపాల్సిన దుస్థితి నెలకొంది. మళ్లీ గోదావరి వరద ఉధృతం అవుతుండటంతో గతేడాది గడ్డు రోజులను అక్కడి ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. తమకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఒక్కరోజే కాపర్‌డ్యామ్ వద్ద వరద నీరు మీటరుకుపైగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితిని చూస్తే గతేడాది మాదిరిగా వేగంగా వరద వచ్చే ప్రమాదం కనిపిస్తోంది. ప్రభుత్వం అందుకు తగిన ముందస్తు చర్యలు తీసుకుని జనాల రక్షణగా నిలవాల్సి ఉంది.

పెరుగుతున్న గోదావరి

ఆచంట: వశిష్ట గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువ నుంచి పెద్దఎత్తున వరద నీరు సముద్రంలోకి వదులుతుండటంతో బుధవారం సాయంత్రం నాటికి కోడేరు వద్ద 24 గంటల్లో సుమారు రెండు అడుగులు నీటిమట్టం పెరిగింది. ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి లంక గ్రామాల్లో ప్రజలు ఎటువంటి ఇబ్బందీ లేకుండా తమ పనులు యధావిధిగా చేసుకుంటున్నారు. ఇంజిన్ పడవలపై గోదావరిలో ప్రయాణికుల రాకపోకలు సాగుతున్నాయి. వరద ఉధృతి ఇదేస్థాయిలో పెరిగితే 2, 3 రోజుల్లో లంక గ్రామాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉందని, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వరదల వల్ల కోడేరులోని ఇసుక ర్యాంపు కొట్టుకుపోయింది.

యలమంచిలి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో గోదావరి నది రెండు రోజులుగా వరద నీరు పెరిగింది. దీంతో లంక గ్రామాలైన కనకాయలంక, పెదలంక, యలమంచిలిలంక, బాడవ, లక్ష్మీపాలెం, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం తదితర గ్రామాల్లో మళ్లీ అలజడి మొదలైంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 14 అడుగులకు నీటిమట్టం పెరిగితే ఆ ప్రభావంతో కనకాయలంక కాజ్ వే మునిగిపోయే పరిస్థితి వస్తుందని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో తమ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే పరిస్థితి వస్తుందని తెలిపారు.

సిఎం, సిఎస్ కార్యాలయాల వద్ద నిరసనకు తీర్మానించండి

మాజీ మంత్రి, మచిలీపట్నం ఎంఎల్ఎ పేర్ని నాని వ్యాఖ్యలు
ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్‌పి సమావేశానికి ఏలూరు కలెక్టర్, ఉన్నతాధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఏలూరు జిల్లా కలెక్టర్, ఆ జిల్లా అధికారులు, మరికొందరు గత రెండు జెడ్‌పి సమావేశాలకు గైర్హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో విలీనమైన నూజివీడు, కైకలూరు ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధులు ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి వచ్చి ఉపయోగం ఏముంది.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏలూరు కలెక్టర్ కృష్ణా జెడ్‌పి సమావేశాలకు వస్తారో, రారో తెలుసుకోండి, రానంటే జడ్‌పిటిసిలతో కలిసి సిఎంను, చీఫ్ సెక్రటరీ కార్యాలయాల ముందు నిరసనకు కూర్చుంటామని జెడ్‌పిలో తీర్మానించాలి ఆ తీర్మానం ప్రతిని ఏలూరు కలెక్టర్‌కు పంపాలి అని మాజీ మంత్రి, మచిలీపట్నం ఎంఎల్‌ఎ పేర్ని వెంకట్రామయ్య (నాని) చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. మచిలీపట్నం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో బుధవారం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ సమావేశం జరిగింది. తాగునీటి, విద్యారంగ సమస్యలపై సమావేశంలో చర్చించారు. కృష్ణాజిల్లా పునర్విభజన అనంతరం ఏలూరు జిల్లాలో విలీనమైన నూజివీడు, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎంఎల్‌ఎలు, జడ్‌పిటిసిలు పలు అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. ఏలూరు జిల్లా కలెక్టర్‌తో పాటు ఆ జిల్లా విద్యాశాఖాధికారి ఈ సమావేశానికి రాకపోతే తాము వచ్చినా ఏం ప్రయోజనం ఉంటుందని ఆయా నియోజకవర్గాల పరిధిలోని జడ్‌పిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, మచిలీపట్నం ఎంఎల్‌ఎ పేర్ని వెంకట్రామయ్య (నాని) జోక్యం చేసుకుని ఏలూరు కలెక్టర్, ఆ జిల్లా అధికారుల తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నూజివీడు ఎంఎల్‌ఎ మేకా ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ తమ జిల్లాకు చెందిన కలెక్టర్, అధికారులు రాకుంటే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన స్థానిక సంస్థల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంటుందన్నారు. జిల్లాల విభజన నేపథ్యంలో ఏలూరు జిల్లాలో విలీనమైన మండలాలకు సంబంధించిన సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం లభించకపోతే రాజ్యాంగ సంస్థలకు విలువ లేకుండా పోతుందన్నారు. దీనిపై జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ కలెక్టరు, జిల్లా అధికారుల గైర్హాజరుపై ప్రభుత్వానికి, సంబంధిత జిల్లా కలెక్టర్‌కు లేఖ రాస్తామని చెప్పారు. ఇకపై జడ్‌పి సర్వసభ్య సమావేశాలకు ఉన్నతాధికారులంతా వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బడిఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

పాఠశాలల్లో డ్రాపవుట్స్ నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా విద్యాశాఖాధికారి శ్యాంసుందర్ పాఠశాలల తనిఖీల్లో భాగంగా బుధవారం ఉదయం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఏలూరు నగర పాలక సంస్థ కస్తూరిబా బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యలో బడిమానేసిన విద్యార్థుల వివరాలను ఆరా తీశారు. బడిమానేసిన పిల్లలు ఎక్కడున్నారు, ఏ ప్రాంతానికి వెళ్లింది వివరాలను వాకబు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమీక్షిస్తూ ఎవరైతే పిల్లలు మధ్యలో బడిమానివేశారో వారి ఇంటికి నేరుగా వెళ్లి ఆయా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి తిరిగి పాఠశాలల్లో చేర్చేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధపెట్టి మూడు రోజుల్లో మధ్యలో బడిమానివేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్చడం లేదా వారు ఏ ప్రాంతానికైనా వెళ్లి ఉంటే సంబంధిత వివరాలతో కూడిన నివేదికను అందజేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిఇఒను కలెక్టర్ ఆదేశించారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న అంబటి

'పోలవరం'లో అంబటి

గోదావరి వరదల నేపథ్యంలో ప్రాజెక్టు పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పోలవరం ప్రాజెక్టును బుధవారం పరిశీలించారు. మంగళవారం రాత్రికి ప్రాజెక్టుకు చేరుకున్న మంత్రి అక్కడే బస చేశారు. తొలుత పోలవరం ప్రాజెక్టు ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల నడుమ వస్తున్న సీలేరు జలాలు డీవాటరింగ్ ప్రాంతానికి వెళ్లడానికి వేసిన తూరలను పరిశీలించారు. డయాఫ్రంవాల్ సమీపంలో ఇసుక వైబ్రో కాంపాక్షన్ పనులు, డయాగ్రామ్ వాల్ ప్రాంతంలో పడిన భారీ అగాధాలను పూడ్చే పనులను పరిశీలించారు. దిగువ కాపర్ డ్యాం వద్ద (డీవాటరింగ్) మోటార్ల ద్వారా నీటిని తోడే పనులను మంత్రి పరిశీలించారు. అనంతరం ఎగువ కాపర్ డ్యామ్ నుండి వస్తున్న సీపేజీ ప్రాంతాలను పరిశీలించారు. స్పిల్‌వేలో రేడియల్ గేట్ల పనితీరుని పరిశీలించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో జల వనరుల శాఖ అధికారులు, గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంజినీరింగ్ చీఫ్ సి.నారాయణరెడ్డి, సిఇ సుధాకర్‌బాబు, ఎస్‌ఇ నరసింహమూర్తి, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ గిరిధర్ రెడ్డి, ఇఇ మల్లికార్జున్‌రావు, పోలవరం తహశీల్దార్ బి.సుమతి, ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు ఆపాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలోని కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి, ఏలూరు మండలాల్లో ఆక్వాచెరువుల అక్రమ తవ్వకాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం సంఘ ముఖ్యకార్యకర్తల సమావేశం సంఘం జిల్లా కార్యాలయంలో పి.అనందరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా యదేచ్ఛగా, అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. మండవల్లి మండలం కానుకొల్లులో, కలిదిండి మండలం సీతారామపురం అగ్రహారంలో, కొండంగిలో, సానా రుద్రవరంలో, ముదినేపల్లి మండలం దేవపూడి, ఊటుకూరు తదితర గ్రామాల్లో ప్రజల ఆవాసాలు, తాగునీటి చెరువులు, తాగునీటి బావులు, పంటచేల మధ్య ఎలాంటి అనుమతులూ లేకుండా అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నారని తెలిపారు. అంతేకాకుండా నియోజకవర్గమంతటా పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గిపోయి ఉపాధి కరువై, తాగునీరు కలుషితమై కిడ్నీల్లో రాళ్లు, కేన్సర్ వంటి రోగాలబారిన పడి పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటచేలు చౌడుబారిపోతున్నాయని కౌలు రైతులు వాపోతున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజల ఆవాసాలు, తాగునీటి చెరువులు, బావులు, వరి పంట భూములు పక్కన ఆక్వా చెరువుల తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దన్నారు.

ఆందోళన చేస్తున్న దళితులు, పేదలపై పోలీసుల బెదిరింపులు, అక్రమ కేసులు ఆపాలన్నారు. మండవల్లి మండలం కానుకొల్లు దళితులపై పోలీసుల వేధింపులు, కలిదిండి మండలం ఎస్‌ఆర్‌పి అగ్రహారం గ్రామ ప్రజలపై బనాయించిన కేసులు ఎత్తివేయాలన్నారు. కైకలూరు మండలం నత్తగుళ్లపాడులో పశువుల చెరువును పూడిక చేయకుండా హైకోర్టు తీర్పు అనుగుణంగా ఆపాలన్నారు. ఏలూరు రూరల్ మండలం కోటేశ్వరదుర్గాపురం లో సుమారు 1.50 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిలో అక్రమంగా చేపల చెరువు తవ్వుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా రెవెన్యూ అధికారులు కలుగజేసుకుని సీలింగ్ భూముల్లో జరుగుతున్న అక్రమ చెరువుల తవ్వకాలు ఆపాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్ దృష్టిలో ఈ సమస్య ఉన్నా నేటికీ పరిష్కారం కాకపోవడం సిగ్గుచేటన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు భూస్వాములిచ్చే లంచాలు మింగి ప్రభుత్వ భూములను భూస్వాములకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ కలగజేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదలను ఐక్యం చేసి పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జాన్‌రాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

అడుగడుగునా దగా..!

'పోలవరం' ముంపు పేరుతో అభివృద్ధికి ఆమడ దూరంలో నిర్వాసిత గ్రామాలు



వర్షానికి చెరువులను తలపిస్తున్న రోడ్డు

ప్రజాశక్తి - కుక్కునూరు

రాష్ట్ర విభజన అనంతరం పోలవరం ముంపు పేరుతో మండల అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేసి ముంపు మండలాల నిర్వాసితుల జీవితాలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయి. పోలవరం నిర్వాసితులు అడుగడుగున దగా పడుతూనే ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తమ జీవితాలను పణంగా పెట్టి సర్వం కోల్పోతున్న పోలవరం నిర్వాసితులు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందేందుకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు శంకుస్థాపన జరిగిన నాటినుండి ప్రతివిషయంలోనూ నిర్వాసితులు దగాపడుతూనే ఉన్నారు. శంకుస్థాపన సమయంలో అప్పటి ప్రభుత్వం నిర్వాసితులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రాయితీలను సకాలంలో చెల్లించి, నిర్వాసితుల త్యాగాలను రాష్ట్ర మొత్తం తెలియజేస్తామని చెప్పిన ప్రభుత్వం ఐదేళ్లలో నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ ఇవ్వకుండానే గత ప్రభుత్వం తన పదవి కాలాన్ని ముగించుకుంది. అప్పటి ప్రభుత్వంలో అధికారులు పోలవరం నిర్వాసితులకు పూర్తి ప్యాకేజీ జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ అంటూ చెబుతూనే కాలం వెళ్లదీశారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం కూడా జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, జూన్ అంటూ కాలం వెళ్లదీస్తుంది. నాలుగేళ్లుగా వైసిపి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలుపరుస్తుంది. ఆ పథకాలకు మండలంలోని అనేక మంది అనర్హులుగా చూపబడ్డారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ నుంచి ఆంధ్రాలోకి విలీనమైన ఏడు మండలాల్లో డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు చేయడం లేదు. రైతులకు క్రాప్ లోన్లు బ్యాంకులు ఇవ్వడం లేదు. చేతివృత్తులకు కార్పొరేషన్ నుంచి రుణాలు మంజూరు జాడే లేదు. యువతీయువకులకు స్వయం అభివృద్ధికి, వ్యాపారాభివృద్ధికి బ్యాంకులు రుణాలిచ్చేందుకు విముఖత చూపిస్తున్నాయి. ముఖ్యంగా డ్వాక్రా మహిళలు బ్యాంకులిచ్చే రుణాల ద్వారానే తమ జీవన విధానాన్ని మెరుగుపరచుకుంటారు. గతంలో భూపరిహారం వచ్చిన భూముల రైతులకు ఎలాంటి బ్యాంకు రుణాలూ అందడంలేదు. రైతు భరోసాకు కూడా వారు అనర్హులే. గోదావరి వరదల పంటనష్టం రావడం లేదు. కేవలం భూ పరిహారం ఇచ్చి ఏళ్ల గడుస్తున్నా పునరావాసం, ఇంటి పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలు అందకపోవడం ఎంత వరకు న్యాయమని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విలీన మండలాల్లోని ఏ ఒక్కరికి స్వయం ఉపాధి లేక, చేసుకునేందుకు పనుల్లేక పట్టణాలకు వలస పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మొత్తం ఏజెన్సీ ప్రాంతవాసులవి రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు. పోలవరం ప్రాజెక్టు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తుంది. సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు పరిహారం ఇవ్వకపోగా, వారికి ఉపాధి కల్పించడంలోనూ ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి.

చెరువులను తలపిస్తున్న ప్రధాన రహదారులు

అశ్వారావుపేట.. భద్రాచలం ప్రధాన రహదారి పరిస్థితి అత్యంత దుర్భరంగా తయారైంది. ప్రతీరోజు ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. లంకాలపల్లి - వెంకటాపురం మధ్య 40 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాలనుకుంటే పెద్ద సాహసంతో రెండు గంటలు పడుతుంది. మండల కేంద్రంలోని కుక్కునూరులో పెట్రోల్ బంకు వద్ద, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూరిబా గాంధీ హాస్టల్ రహదారిలో పెద్ద పెద్ద గోతులు పడి చిన్నపాటి వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పటికే కుక్కునూరు, గొమ్ముగూడెం రోడ్డు అధ్వానంగా తయారవ్వడంతో బస్సులు బస్టాండ్‌కు గత మూడేళ్లుగా వెళ్లకపోవడంతో విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అటు ప్రభుత్వం, ఇటు ప్రజా ప్రతినిధులు పట్టించుకోకుండా ఉన్నారంటే వారికి ముంపు మండలాల పట్ల ఎంత ప్రేమ ఉందో అర్థవుతుంది.

వరద పరిహారానికి వారు అర్హులు కాదా..?

గతేడాది వచ్చిన గోదావరి వరదలకు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో చెట్టుకొకరు పుట్టకొకరుగా తలదాచుకుని ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఏడాది గడిచినా నేటికీ పూర్తిస్థాయిలో రూ.పదివేలు వరద నష్టం అందలేదు. నిర్వాసితులు ప్రతి విషయంలోనూ దగా పడుతూనే చావలేక బతకలేక ఓ వైపు గోదావరి వరదలు మరో వైపు పరిహారం రాక తీవ్ర ఇబ్బందులు పడుతూ కాలం వెళ్ల దీస్తున్నారు. సంక్షేమ పథకాల ఊసే లేదు. కనీసం వరద సాయం కూడా ఈ ప్రభుత్వం అందించడం లేదంటే నిర్వాసితులు పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో స్పష్టమవుతుంది. పోలవరం ముంపుతో సంబంధం లేకుండా మండలంలో అన్ని గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి పనులు చేపట్టి తమకు న్యాయం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు అభివృద్ధి చేయాలి



మురళి, కుక్కునూరు

మండలంలోని ప్రధాన రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి కనీసం పట్టించుకున్న నాథుడే లేడు. స్థానిక పెట్రోల్ బంకు నుండి రైస్ మిల్లు వరకు గల రోడ్డుపై పెద్దపెద్ద గోతులు పడి వర్షపునీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. ఎక్కడ పెద్ద గోతులు ఉన్నాయో తెలియక తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో రోడ్డుపై వెళ్లేవారు ఆందోన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణం పనులు త్వరగా చేపట్టాలి

మమ్మల్ని పూర్తిగా విస్మరించారు



వనమా భాగ్యలక్ష్మి, కుక్కునూరు

పోలవరం ముంపు పేరుతో మండలంలో అభివృద్ధిని పూర్తిగా నిలిపారు. ముంపులో ఉన్నామని కనీసం డ్వాక్రా మహిళలమైన మాకు స్థానిక బ్యాంకులో రుణాలు కూడా ఇవ్వమంటున్నారు. పోలవరం పరిహారం ఇవ్వకుండా, ఓ వైపు బ్యాంక్ లోన్లు ఇవ్వకుండా ముంపు పేరుతో అభివద్ధి నిలపడంతో ఎంత కాలం ఇలా ఉండాలి, అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. మళ్లీ గోదావరి వరదలు వస్తే మా పరిస్థితి ఏంటి, ప్రభుత్వం స్పందించి మాకు రావాల్సిన పరిహారం ఇచ్చి మమ్మల్ని ఇక్కడ నుండి పంపండి

వట్టి వారసుడి రాజకీయ అరంగేట్రం

ప్రజాశక్తి - ఉంగుటూరు



వట్టి పవన్ కుమార్

మాజీ మంత్రి, కీర్తిశేషులు వట్టి వసంత్‌కుమార్ వారసుడు వట్టి పవన్‌కుమార్ రాజకీయ అరంగేంట్రం చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉంగుటూరు మండలంలో వెల్లమిల్లి, బాదంపూడి, గుళ్లపాడు, నాచుగుంట తదితర గ్రామాల్లో పర్యటించారు. వసంత్ కుమార్ అనుచరులు, అభిమానులు, ఆనాడు వసంత్‌కుమార్‌తో సత్సంబంధాలు కలిగిన ముఖ్యనాయకులు, మాజీ ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిసి పరిచయాలు చేసుకున్నారు. పవన్‌కుమార్ రాజకీయ అరంగేంట్రం చేయనున్నారనే ప్రచారం క్రమంలో మండలంలో విస్తృతంగా పర్యటించి కీలక నేతలను కలవడంపై ఆసక్తి నెలకొంది. నాయకులు అభిప్రాయాలు తీసుకుని రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనలో పవన్‌కుమార్ ఉన్నట్లు తెలుస్తోంది. ఏ పార్టీలో చేరాలన్న విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని వసంతకుమార్ అభిమానులు, కార్యకర్తల సూచన మేరకు ముందుకు వెళ్తానని ఆయన స్పష్టం చేశారు. వసంత్‌తో గతంలో సన్నిహితంగా మెలిగిన నాయకులతో సమాలోచన చేశారు. జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కాటి కిరణ్‌కుమార్, మాజీ ఎంపిపి చిట్టూరి హరిబాబు, డిసిసిబి మాజీ డైరెక్టర్ మైలవరపు గోపాలకృష్ణ, కాంగ్రెస్ యూత్ నాయకుడు ముత్యాల బాలాజీ, గట్టిం నాని, మంద శ్రీనివాసరెడ్డి, యెగ్గిన ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచి ఎం.రత్తయ్య పాల్గొన్నారు. సెంటిమెంట్‌గా ఉంటుందని మండలంలో ఈశాన్యం వైపు గ్రామమైన వెల్లమిల్లి నుంచి పర్యటన ప్రారంభించారు. ఆనాడు వసంత్‌కుమార్ సైతం ఎన్నికల ప్రచారాన్ని ఇదే గ్రామం నుంచి ప్రారంభించడం గమనార్హం.

ద్వారకాతిరుమల: మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ స్ఫూర్తితో, ఆయన ఆశయ సాధనలో ముందుకు వెళ్తూ ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో రాజకీయరంగ ప్రవేశం చేస్తున్నట్లు వట్టి వెంకట పవన్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఎంఎం.పురంలోని గాంధీ విగ్రహానికి నమస్కరించి అక్కడ నుంచి ద్వారకాతిరుమల చినవెంకన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసంతకుమార్ ఉంగుటూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారని, ఇప్పటికీ పార్టీలకతీతంగా చాలామందిలో ఆయన సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారన్నారు. సీనియర్ నాయకులు సంకబత్తుల పాపారావు, పుప్పాల మురళీ, వట్టి నారాయణ, లక్ష్మణ్, సాయి పాల్గొన్నారు.

గిరిజనుల సాగుభూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



ధర్నా చేస్తున్న నాయకులు, గిరిజనులు

గిరిజనుల సాగులో ఉన్న అటవీ భూములకు పట్టాలివ్వాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోట రామచంద్రాపురంలోని ఐటిడిఎ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభనుద్దేశించి సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని కోరారు. గ్రామ సభలు నిర్వహించడానికి రూట్ మ్యాప్, షెడ్యూలు ప్రకటించాలని, గిరిజనుల సాగులో ఉన్న ఎల్‌టిఆర్ భూములకు సాగులో నమోదు చేయడానికి అధికారులు, ప్రజాసంఘాల నాయకత్వంతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని ఐటిడిఎ పిఒ సత్యనారాయణను కోరారు. అటవీ భూముల గురించి వ్యక్తిగత దరఖాస్తులను పిఒకు అందించారు. దీనిపై పిఒ మాట్లాడుతూ ఆగస్టు మొదటి వారంలోనే ఆర్‌ఒఎఫ్‌ఆర్ భూములకు సంబంధించిన జాయింట్ మీటింగ్ ఏర్పాటుకు తేదీ నిర్ణయిస్తామన్నారు. అదేవిధంగా మాతృభాష విద్యా వాలంటీర్లను రెన్యువల్ చేస్తామని, రెండు నెలలు వేతనాల బిల్లులు చేస్తామని కూడా హామీ ఇచ్చారన్నారు. ఈ ప్రక్రియ అంతా వచ్చేనెల మొదటి వారంలో పూర్తి చేస్తామని గిరిజన సంఘం నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోని సిఐటియు జిల్లా నాయకురాలు నాగమణి. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు, తామ ముత్యాలమ్మ, చంద్రు బుల్లమ్మ. తెల్ల వెంకటలక్ష్మి గిరిజనులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ..

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరినాట్లు పడ్డాయి. వర్షాలు లేక వరినాట్లు ఎండిపోతున్న సమయంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు ఊరట నిచ్చాయి. మండలంలో ప్రతి సంవత్సరం 19 వేల ఎకరాలలో వరి పంటను రైతులు పండిస్తారు. ప్రస్తుతం 150 ఎకరాలలో వరినాట్లు వేశారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం వర్షాలు లేక రైతులు వరినాట్లు ఆలస్యం చోటు చేసుకుంది. రెండు రోజులుగా వర్షాలు ఎడతెరపి లేకుండా కురవటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు : టిడిపి


ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వైసిపి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని టిడిపి నాయకులు విమర్శించారు. బుధవారం టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ, మండల అధ్యక్షులు సాయి సత్యనారాయణ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హింసలకు నిరసనగా టిడిపి చింతలపూడి నియోజకవర్గ మహిళా కమ్మిటీ కన్వీనర్ చిలపరెడ్డి ఇంద్రాణి అధ్యక్షతన మహిళల ఆత్మ గౌరవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ కరుటూరి రమాదేవి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మద్యపానం నిషేధిస్తానని చెప్పి, పత్రికా ప్రకటనలో మద్యంపై ఎక్కువ ఆదాయం వచ్చిందని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. జాతీయ స్థాయి నేర రికార్డులో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర మహిళా కమిటీ కార్యనిర్వాహణ కార్యదర్శి పగడం సౌభాగ్యవతి మాట్లాడుతూ సోషల్ మీడియాలో మహిళల పట్ల చాలా అసభ్యంగా పోస్టులు పెడుతున్నారన్నారు. ఇది మహిళల్ని మానసికంగా హింసించడం, వారి గౌరవాన్ని అపహాస్యం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు, రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు రాజాన పండు, ప్రధాన కార్యదర్శులు కుక్కల మాధవరావు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్న జగన్ : టిడిపి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సిఎం జగన్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి, సంక్షేమ పథకాలు ఇస్తూ, ఎటువంటి అభివృద్ధి లేకుండా సంక్షోభంలోకి నెట్టాడని టిడిపి పోలవరం నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఆయన మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు విగ్రహానికి, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. బుట్టాయగూడెం టౌన్‌లో ఇటీవల మహానాడు వేదికగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మ్యానిఫెస్టోలోని పథకాలు వివరిస్తూ, భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంచుతూ ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బొరగం మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలనలో పెరిగిన ధరలు, పెంచిన ఛార్జీలు, అధిక పన్నులతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచి అందరిని ఆర్థికంగా ఎదిగేలా చేయటం జరుగుతుందని అందరూ ఎన్నికల్లో సహకరించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మొగపర్తి సొంబాబు, మండల ప్రధాన కార్యదర్శి గుండుబోయిన మురళీ కృష్ణ పాల్గొన్నారు.


పిల్లి రాముకి ఆర్థికసాయం చేసిన చంద్రబాబు

అనారోగ్య బాధితునికి రూ.25 వేలు సాయం

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు స్వయంగా తమకు ఆర్థిక సహాయం చేయడం చాలా ఆనందంగా వుందని టిడిపి కార్యకర్త పిల్లి రాము అన్నారు. బుధవారం టిడిపి రాష్ట్ర కార్యాలయంలో రూ.25 వేలు నగదు టిడిపి అధ్యక్షులు చంద్రబాబు అందజేశారు. చింతలవల్లి గ్రామానికి చెందిన పిల్లి రాము గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో భాధపడుతున్నారు. ఈ ఆర్థిక సహాయం రావడానికి రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు కృషి ఫలితామేనని ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

నేరాలు - ఘోరాలు

యాసిడ్ విక్రయాలపై తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలో ఉన్నటువంటి యాసిడ్ విక్రయదారులు, వినియోగదారులను రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ బుధవారం తనిఖీలు చేశారు. జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు వెంకటాద్రిపురంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలోని ల్యాబ్‌లలో యాసిడ్ వినియోగమును తనిఖీ చేసి, తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా యాజమాన్యానికి ఎస్ఐ ఆదేశాలు జారీ చేశారు.

పేకాట, కోడి పందేల శిబిరాలపై దాడి

ఆరుగురు అరెస్టు

మండవల్లి: గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై, కోడిపందాలపై పోలీసులు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం అప్పాపురం శివారు డొంక రోడ్లో పేకాట ఆడుతున్నారని, అయ్యోవారి రుద్రవరంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను, రుద్రవరంలో కోడిపందాలు వేస్తున్న మరో ముగ్గురిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నామన్నారు. పేకాట ఆడుతున్న వారి దగ్గర నుంచి రూ.పది వేల 20 నగదును, కోడిపందలాడవుతున్న వారి దగ్గర నుంచి రూ.రెండు వేల 60తో పాటు కోడిపుంజును, కోడి కత్తిను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాల అడ్డుకట్టకు ప్రజలు నెంబర్‌కు 9440796436 ఫోన్ చేసి సమాచారం అందించి సహకరించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

టి.నరసాపురం: నాటుసారా అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కుమార్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తెడ్లెం గ్రామ శివార్లలో అక్రమంగా నాటుసార రవాణా చేస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో దాడి చేశామన్నారు. తనిఖీలు నిర్వహించి ద్విచక్ర వాహనంపై 40 లీటర్ల నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతనిపై తదుపరి చర్యలు తీసుకోవాలని చింతలపూడి ఎస్ఇబి పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.



'జగనన్న సురక్ష'ను ప్రజలు వినియోగించుకోవాలి


ఉంగుటూరు జగనన్న సురక్షలో ఎంఎల్ఎ వాసుబాబు..

ప్రజాశక్తి - టి.నరసాపురం

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వైసిపి జిల్లా రైతుసంఘం అధ్యక్షులు వాసిరెడ్డి మధు అన్నారు. మండలంలోని తెడ్లెం గ్రామ సచివాలయం వద్ద బుధవారం సర్పంచి స్రవంతి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మధు మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీలకతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సురక్ష కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బండి సుబ్బారావు, ఎస్‌విపికెహెచ్ శ్రీనురాజు, ఎంపిడిఒ మంగాకుమారి పాల్గొన్నారు.

ఉంగుటూరు: జగనన్న సురక్షా కార్యక్రమాన్ని బుధవారం కైకరం వనచర్ల ఫంక్షన్ ప్లాజాలో నిర్వహించారు. వివిధ ధృవపత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్నవారికి ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు ఎంఎల్ఎ వివరించారు. మండల ప్రత్యేకాధికారి, డిఎల్‌డిఒ రమణ, తహశీల్దారు ఎవి రమణారావు, డిటి బొడ్డేపల్లి దుర్గా ప్రసాద్, జడ్‌పిటిసి సభ్యురాలు జయలక్ష్మి పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని ఐటిడిఎ, పిఒ జివివి సత్యనారాయణ తెలిపారు. బుధవారం పి.అంకంపాలెం పంచాయతి పునరావాస కాలనీలోని కొరుటురు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల సేవలందించే కార్యక్రమమే జగనన్న సురక్షఅని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, జడ్‌పిటిసి కలుమ్ హేమ కుమారి, తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ శ్రీను, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని మండల అధ్యక్షురాలు కొర్స.పొసమ్మ తెలిపారు. బుధవారం స్వర్ణవారి గూడెం పంచాయతి పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతి పరిధిలో మొత్తం 1000కు పైగా ఇళ్ల సర్వేను వాలంటీర్లు పూర్తి చేశారని తెలిపారు. అనంతరం పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సోమగాని.శ్రీనివాస్, జెడ్‌పిటిసి వసంతరావు, కన్వీనర్ గూడవల్లి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: మండలంలోని పోలసానపల్లి గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా అర్హులైన 484 మందికి పలు రకాల ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వి.ఎ.విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలోని భాస్కర్‌రావుపేటలో జరిగిన జగనన్న సురక్ష ద్వారా వివిధ ధృవపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్లను కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు బుధవారం అందజేశారు. తొలుత రూ.20 లక్షల ప్రభుత్వ నిధులు, రెండు లక్షల గ్రామ పంచాయతీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, సర్పంచులు గద్దే ఆనంద్ కుమార్, ద్రోణాద్రి నాగలక్ష్మి, అనపర్తి వడ్డీకాసులు, ఎంపిటిసిలు చేవాకుల పద్మ, ఇ.లక్ష్మణరావు, ఎఎంసి ఉపాధ్యక్షులు పాము రవికుమార్, అల్లూరి రాజు, మంతెన రామరాజు, సచివాలయ సహాయకులు, గృహసారధులు పాల్గొన్నారు.


ఏలూరు టౌన్: రాష్ట్రంలో ప్రతీసంక్షేమ పథకం దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా ప్రజలకే అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి అని కో-ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మెడికల్ రిప్రజెంటేటివ్స్ హాలులో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెదబాబు హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, డిప్యూటీ కమిషనర్ ఎన్.రాధ, కార్పొరేటర్లు ఎర్రంశెట్టి సుమన్, కత్తిరి రామ్మోహన్‌రావు, తోట శివ, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జలకళతో ముదినేపల్లిలోని పోల్‌రాజ్ కాలువ..

పంట కాలువలకు జలకళ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ప్రధాన పంట కాల్వలైన సిబి కెనాల్, పోల్‌రాజ్ కెనాల్‌కు నిండా నీరు చేరుకుని జలకళ సంతరించుకుంది. సోమవారం వరకూ కాల్వ సామర్థ్యానికి తగ్గ నీటిని అధికారులు విడుదల చేయలేదు. కాల్వలో నీరు ప్రవహిస్తున్నా ఆనీరు మండలంలోని శివారు గ్రామాలకు చేరలేదు. దీంతో పలు గ్రామాల్లో మంచినీటి చెరువులు నింపుకునేందుకు తగిన నీరు కాల్వలకు విడుదల కాలేదు. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద ఏర్పడ్డ సమస్యల కారణంగా పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయలేదని అధికారులు చెబుతున్నారు. గత పది రోజులుగా మండలంలోని ప్రధాన పంట కాల్వల్లో నిండా నీరు ప్రవహిస్తోంది. రెండు పంట కాల్వలకు నీరు నిండా రావడంతో కాల్వలు జలకళ సంతరించుకున్నాయి. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. పంట బొదెలను బాగు చేస్తూ, పొలంగట్లు సరి చేస్తున్నారు. మొన్నటి వరకూ వర్షాభావంతో కాల్వలకు నిండా నీరు రాక, వచ్చిన నీరు చేల్లో చేరే పరిస్థితి లేకపోవడంతో రైతన్నలు ఇక్కట్లు పడ్డారు. ప్రస్తుతం ప్రధాన పంటకాల్వల్లో పూర్తిస్థాయిలో నీరు ప్రవాహించడంతో పాటు, తరచూ వర్షాలు పడుతుండడంతో రైతన్నలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



డెంగ్యూపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

జ్వరం వచ్చినవెంటనే డెంగ్యూవ్యాధి నిర్ధారణా పరీక్షలు చేయించుకోవాలని రమణక్కపేట పిహెచ్‌సి వైద్యులు కరిముల్లా తెలిపారు. బుధవారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో పిహెచ్‌సి వైద్యులు కరిముల్లా, నూజివీడు డివిజన్ సబ్ ఇంటి పరిసర ప్రాంతాలు మురుగు నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మంచినీరు వాటర్ ట్యాంక్‌లలో బ్లీచింగ్ చల్లుకోవాలని, సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాణి, అమరావతి, ఆశాలు, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి ట్రిపుల్ ఐటీల్లో కౌన్సెలింగ్

నూజివీడు రూరల్: రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటిలకు సంబంధించి ప్రవేశాల కౌన్సెలింగ్ ఈనెల 20వ తేదీ నుండి నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య గోపాలరాజు బుధవారం తెలిపారు. ఈనెల 20, 21 తేదీల్లో నూజివీడు ట్రిబుల్ ఐటీలోను 21, 22 తేదీల్లో ఇడుపులపాయలోను, 24, 25 తేదీల్లో శ్రీకాకుళంలోనూ, ఒంగోలు ట్రిబుల్ ఐటీలో సీటు వచ్చిన అభ్యర్థులకు ఇడుపులపాయ త్రిబుల్ ఐటీ క్యాంపస్‌లో 24, 25 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించాలి

టి.నరసాపురం: పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జంగారెడ్డిగూడెం డివిల్‌పిఒ ఎమ్‌డి.రజావుల్లా సూచించారు. మండలంలోని బొర్రంపాలెంలో సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 15వ తేదీ నుండి పంచాయతీల్లో పన్ను చెల్లించేందుకు నగదు రహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీల విస్తరణ అధికారి రామకృష్ణ, కార్యదర్శి శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ మొక్కలు నరికిన వ్యక్తులపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆయిల్‌ఫామ్ మొక్కలు నరికి ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణా రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన రావు శ్రీధర్‌కు మండలంలోని మర్రిగూడెం గ్రామంలో సర్వే నెంబరు 586/2, 587/6లో వ్యవసాయ భూమి వుంది. మర్రిగూడెం గ్రామానికి చెందిన పూనెం కళ్యాణ్, పూనెం బాబురావు, తుట్టి నాగేశ్వరరావు సుమారు 15 మంది మూడు ట్రాక్టర్లతో రావు శ్రీధర్ వ్యవసాయ భూమిలోనికి అక్రమంగా ప్రవేశించి 50 పామాయిల్ మొక్కలు నరికి, ఆ భూమిని దున్ని పత్తి గింజలు నాటినట్లు శ్రీధర్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


చిన్నారులను పరామర్శిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు..

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తల సేమియా భవనంలో బుధవారం 11 మంది తలసేమియా చిన్నారులకు రక్త మార్పిడిని నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా లయన్స్‌క్లబ్ గవర్నర్ గట్టు మాణిక్యాలరావు, లయన్స్‌క్లబ్ సభ్యులు పద్మజ, డిసిఎస్ మల్లేశ్వరరావు, సిహెచ్ అవినాష్‌లు తలసేమియా చిన్నారులను పరామర్శించి వారికి పండ్లను పంపిణీ చేశారు. అనంతరం తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు 30 మందికి మధ్యాహ్నం ఉచిత భోజనం ఏర్పాటు చేసిన మానవత విద్యానిధి, కేంద్ర నియంత్రణ కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావుకు కృష్ణారెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ కె.వరప్రసాదరావు, మానవత సభ్యులు కృష్ణారావు పాల్గొన్నారు.

మురుగు తొలగింపు చర్యలు

ప్రజాశక్తి - మండవల్లి


మండవల్లిలో మురుగు తొలగింపు చర్యలు..

జా తీ య ం రహదారిపై చేరుకున్న మురుగునీటిని తొలగించేలా చర్యలు చేపట్టామని మండవల్లి మండల విస్తరణాధికారి ఆనందబాబు తెలిపారు. మురుగునీరు జాతీయ రహదారిపై నుంచి గ్రామంలోని రోడ్లపై చేరుకుంటున్నాయని గ్రామస్తులు గ్రామ సభలోని అధికారుల దృష్టికి తీసుకురావడంతోపాటు డ్రయినేజీ సమస్యలను పరిష్కరించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం స్పందనలో కలెక్టర్‌కు ఆర్జీ రూపంలో వినతిని సమర్పించారు. దీంతో స్పందించిన విస్తరణాధికారి ఆనందబాబు మండవల్లిలో పర్యటించి రోడ్లపైకి చేరుకున్న నీటిని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. విస్తరణ పనులలో భాగంగా డ్రయినేజీ నిర్మాణాన్ని వదిలేయడంతో మురుగుపారేందుకు అవకాశం లేక జాతీయ రహదారి పైకి చేరుకుని దుర్వాసన వెదజలుతుందని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. రహదారిపై పెద్ద పెద్ద గోతులు పడి ఆ గోతుల్లోకి మురుగునీరు చేరుకుని, గుంటలు కనపడక వాహనదారులు ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారన్నారు. వాహనాలు ఆ గోతుల్లో పడడంతో వచ్చే శబ్దానికి రాత్రి వేళల్లో భయాందోళన చెందుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. విస్తరణ అధికారి స్పందించి మురుగు పోయే విధంగా బుధవారం చర్యలు చేపట్టారు. ప్రొక్లైన్లు, బ్లేడ్ ట్రాక్టర్లు ఏర్పాటుచేసి మురుగు పోయేలా చర్యలు తీసుకోవడంతో పాటు రహదారిపై ఏర్పడిన గుంటలను పూడుస్తున్న విధానాన్ని ఆయన దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రయినేజీ నిర్మాణం త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేయాలని సంబంధిత అధికారులతో మాట్లాడడం జరిగిందని, త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యత సభ్యులు ఎల్ఎస్ భాస్కరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


రేకుల షెడ్డు పెచ్చులూడి పడి

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - పోలవరం


విద్యార్థులపై ఊడిపడిన సీలింగ్..

మండలంలోని బోడిగూడెం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో నిద్రిస్తున్న విద్యార్థులపై రేకుల షెడ్డు సీలింగ్ పెచ్చులూడి పడటంతో ఇద్దరు విద్యార్థినులు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. గిరిజన ఆశ్రమ బాలికల వసతి గృహంలో రేకులతో నిర్మించిన షెడ్డులో విద్యార్థులు నిద్రించారు. తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో రేకుల షెడ్డుకి వేసిన పిఒపి సీలింగ్ నాణ్యతా లోపం కారణంగా ఒక్కసారిగా విరిగి నిద్రిస్తున్న విద్యార్థులపై పడ్డాయి. దీంతో విద్యార్థులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో తొమ్మిదితో తరగతి చదువుతున్న గుంజవరపు నిహారిక, కంగాల భావనకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని వింజరం పిహెచ్‌సికి తరలించి చికిత్స అందించారు. పిహెచ్‌సి వైద్యాధికారి కె.మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థినులకు స్వల్ప గాయాలయ్యాయని, ఎలాంటి ప్రమాదమూ లేదని, తలకు తగలడంతో ముందుజాగ్రత్తగా సిటీ స్కానింగ్ చేయించి పరీక్షలు నిర్వహించాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని తెలిపారు. ఇటీవల తహశీల్దార్ బి.సుమతి బోడిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో బస చేసి, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తరుణంలో ఇలాంటి ఘటన జరగడం పట్ల తహశీల్దార్‌ను వివరణ కోరగా విద్యార్థుల భద్రత పట్ల అప్రమత్తంగా ఉంటున్నామని, ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు.


దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

దంత ధావనంపై అవగాహన కలిగి ఉండాలని దంత వైద్య నిపుణులు డాక్టర్ దేవిశెట్టి దినేష్ అన్నారు. పట్టణంలోని అమర్భవన్ ఆవరణములో మ్యాంగో టౌన్ ప్రెస్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా డెంటల్ క్యాంపు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు దేవిశెట్టి దినేష్ మాట్లాడుతూ దంతాల పరిరక్షణతో గుండె జబ్బులు దరిచేరవన్నారు. దంత సంబంధిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి తక్షణమే వైద్య సేవలు పొందాలని వివరించారు.